# తీర్పు

శ్రీమతి ఎస్సెల్వైన్మూర్తి



మథురా నగరంలో మాధవయ్య అనే వ్యాపారొకడున్నాడు. ఆయన తన కుమారుని వివాహసందర్భంలో వధూవరుల నిద్దరినీ ఊరేగించే ఉద్దేశంతో మకరప్ప అనే తన స్నేహితుని దగ్గిర ఉన్న ఏనుగును అడిగి తీసుకు వచ్చాడు. అనుకున్నట్టుగానే వివాహం వైభవంగా జరిపించాడు. ఇంతలో ఏనుగుకు ఏదో జబ్బు వచ్చి హఠాత్తుగా చనిపోయింది.

మకరప్ప ఎంత గొడవ చేస్తాడోనని దిగాలు పడి కూర్చున్న మాధవయ్య దగ్గిరకు 'ఇంకా పంప లేదేమయ్యా?' అంటూ రానేవచ్చాడు,

జరిగిందంతా చెప్పి 'మరో ఏనుగు కొనిమ్మన్నా ఇస్తాను. లేదా ఈ ఏనుగు విలువ ఇంతవుతుందంటే, అంత డబ్బయినా ఇస్తాను' అన్నాడు మాధవయ్య.

'నాకు మరో ఏనుగా వద్దు, నీ డబ్బూ వద్దు. నా ఏనుగే బంగారంలాంటి ఏనుగ! అదే కావాలి నాకు' అన్నాడు మకరప్ప. ఎవరు ఎన్నివిధాలుగా నచ్చ చెప్పబోయినా మకరప్ప తన పట్టు వదలక పోగా, న్యాయాధికారి దగ్గరకు వెళ్ళండన్నారందరూ.

ఇద్దరూ న్యాయాధికారి దగ్గరకు వెళ్ళారు. విషయాన్ని వివరించారు. ఇరుపక్షాల వాదనలనూ విన్న న్యాయాధికారి 'రేపు ఉదయం తీర్పు చెబుతాను' అని పంపాడు. ఆ తర్వాత మాధవయ్యనొక్కడినే పిలిపించి ఏదో చెప్పి పంపాడు.

మరునాడు ఉదయాన్నే మకరప్ప మాధవయ్య ఇంటికి వచ్చి పిలిచాడు. ఎంత పిలిచినా, మాధవయ్య పలకక పోవడంతో మూసి ఉన్న తలుపుల్ని ఒక త్రోపు తోశాడు. పెద్ద శబ్దం చేస్తూ తలుపుకు అడ్డంగా పెట్టి ఉన్న కుండలన్నీ పడి పగిలి పోయాయి, తలుపు తెరుచుకుంది. మాధవయ్య ఇంట్లోంచి పరుగెత్తుకొచ్చి 'ఏమిటయ్యా మకరయ్యా! మా తాతల తరాలనుండీ దాచుకున్న కుండలన్నింటినీ నాశనం చేశావు. కాసేపు ఓపిక పట్టలేకపోయావా? నేను వస్తూనే ఉన్నాగా? అయ్యయ్యో నా కుండలన్నీ పోయాయే! ముందు నా కుండలు నాక్కావాలి. ఆ తర్వాత నీ ఏనుగు సంగతి' అని అక్కడే చతికిలబడ్డాడు.

'పాత కుండలకే అలా దిగాలుపడతావేమయ్యా ? నేనేమైనా నీ కుండల్ని పగలగొట్టాలని వచ్చానా? అసలు తలుపు దగ్గిర అలా ఎందుకు పెట్టావు?' అని దబాయించి అడిగాడు మకరప్ప.

'ఏమిటీ ? పాత కుండలంటున్నావా? అవన్నీ మా తాతల, ముత్తాతల స్మృతి చిహ్నాలు. వాటిని చూస్తుంటే వాళ్ళంతా గుర్తుకొచ్చే వాళ్ళు. రోజూ వాటిని చూసుకుంటూనే అలా నిద్రపోయే అలవాటు ఉంది నాకు. నిన్ను తలుపెవ్వడు తోయమన్నాడు? నా దగ్గిర కెవడు రమ్మన్నాడు? సమయంకాగానే నేనే రాకపోయనా న్యాయాధికారి దగ్గిరికి?

అయ్యయ్యో నా కుండలన్నీ పోయాయే' అని ఏడుస్తున్నాడు మాధవయ్య.

'నీ కుండలు నీకు కొనిస్తాలేవయ్యా ముందు న్యాయాధికారి దగ్గరకు నడువ్' అన్నాడు మకరప్ప.

'కొత్త కుండలు నా కెందుకూ . ముందు నా కుండలు నా కివ్వు తర్వాతే నీ ఏనుగు తీర్పుకెళ్దాం' అన్నాడు మాధవయ్య.

'నా కుండలు అంటే 'నా ఏనుగు' అంటూ ఇద్దరు కాసేపు తగవులాడుకున్నారు. ఇరుగు పొరుగు వారంతా ఈసారి ఏమీ చెప్పడం లేదు. నవ్వుకుంటూ చూస్తున్నారు పరిష్కారమెలా అవుతుందో చూడామని.

విసుగెత్తిపోయిన మకరప్ప 'నీవు—నా ఏనుగనూ ఇవ్వకు. నేను నీ కుండలూ ఇవ్వను సరా?' అన్నాడు.

'నీ ఏనుగ సంగతి న్యాయాధికారి తీర్పు మీద ఆధారపడి ఉంటుంది. కాని నా కుండలు మాత్రం నా క్కావాల్సిందే' అని మాధవయ్య గోలపెట్ట నారంభించాడు.

ఇరుగు పొరుగు వారప్పుడు కలగ చేసుకుని మకరప్ప అన్నదానికి మాధవయ్య నొప్పించి, మకరప్పను పంపించివేశారు.

న్యాయాధికారి ఈ తగవు తీర్చేమార్గం ఇంత బాగా చెప్పినందుకు అందరూ ఆయనను అభినందించారు. ★